ప్రజాశక్తి
ఆదివారం 24 నవంబర్ 2024
5

మండల స్థాయిలోనూ పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపాల్టీల పరిధిలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను పిజిఆర్ఎస్‌లో నమోదు చేసి, సకాలంలో విచారించి, ఫిర్యాదుదారుడ్ని సంతృప్తి చెందేలా తగు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నందున ప్రతి సోమవారం నిర్వహించు గ్రీవెన్సుకు మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే దరఖాస్తులు ఇచ్చుటకు వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు మెలిక

- పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- 11మందే బ్యాంక్ గ్యారంటీల సమర్పణ
- రైతుల నుంచి సేకరణపై తీవ్ర ప్రభావం

నూర్పులు పూర్తయి కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు మెలిక పెడుతున్నారు. గత మూడేళ్లుగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పేరుకుపోయిన మిల్లింగ్ డబ్బులు, ఇతర బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం సేకరణపై జిల్లా అధికారులు ఇప్పటికే రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించారు. ఆయా మిల్లుల మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలని అధికారులు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. జిల్లాలో 93 రైస్ మిల్లుల్లో ధాన్యం సేకరణ జరుగుతుంది. ఈ మిల్లుల యజమానులు విధిగా బ్యాంక్ గ్యారంటీలను చెల్లించిన తర్వాతే సేకరణ ప్రక్రియ మొదలవుతుంది. అయితే జిల్లాలో ఇంతవరకు 11 మంది మిల్లర్లు మాత్రమే బ్యాంక్ గ్యారంటీలను సమర్పించారు. బ్యాంక్ గ్యారెంటీ రూపంలో రూ.4.55 కోట్లను మిల్లర్లు చెల్లించారు. ఇంకా 82 మంది మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ లను చెల్లించాల్సి ఉంది. శుక్రవారం జాయింట్ కలెక్టర్ శోభిక మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో బ్యాంక్ గ్యారంటీలపై డెడ్‌లైన్ విధించారు. సోమవారం నాటికి మిగిలిన 82 మంది మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మిల్లర్లు పూర్తి స్థాయిలో బ్యాంక్ గ్యారంటీలు చెల్లించే అవకాశం కనిపించడం లేదు. దీని ప్రభావం జిల్లాలో ధాన్యం సేకరణపై తీవ్రంగా కనిపించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ ఏడాది సీజన్‌లో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ ఏడాది సీజన్‌లో 2.2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఇప్పుడిప్పుడే ధాన్యం నూర్పిడి పనులు జరుగుతున్నాయి. వీరఘట్టం, సీతానగరం, జియ్యమ్మవలస మండలాల్లో ధాన్యం అమ్మకానికి రైతులు సిద్ధం చేశారు. మిల్లర్ల బ్యాంక్ గ్యారంటీలు సకాలంలో అందకపోతే అందుబాటులో ఉన్న మిల్లర్లతోనే ధాన్యం సేకరణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. తక్కువ మిల్లుల్లో మిల్లింగ్ ప్రారంభమైతే రైతుల తాకిడి పెరిగి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. రైతులు ధాన్యాన్ని దూరంగా ఉన్న మిల్లులకు రవాణా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రవాణా ఛార్జీలు ప్రభుత్వం చెల్లించినా రైతులు దగ్గర్లో ఉన్న మిల్లుకే తరలించేందుకు ప్రయత్నిస్తారు. దీని వల్ల రైతులు కొంత ఒత్తిడి ఎదుర్కొనే అవకాశం ఉంది.

బకాయిలతో బ్యాంక్ గ్యారంటీలకు ముడి

తమకు గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన మిల్లింగ్, ఇతర బకాయిలు చెల్లించిన తర్వాత బ్యాంక్ గ్యారంటీలను సమర్పించగలమని మిల్లర్లు చెబుతున్నారు. 2022-23, 24 సంవత్సరాల్లో ధాన్యం సేకరణకు సంబంధించిన మిల్లింగ్, ఇతర బకాయిలు రూ.40 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఉన్నప్పుడు మంజూరు కావాల్సిన బకాయిలు రూ.20 కోట్ల వరకు వుంది. ఈ బకాయిల్లో ఎంతోకొంత చెల్లిస్తే బ్యాంక్ గ్యారంటీలను సమర్పిస్తామని మిల్లర్లు వాదిస్తున్నారు. ఇప్పటికే మిల్లుల మరమ్మతులు, నిర్వహణకు డబ్బులు ఎక్కువగా ఖర్చు చేశామని, ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదలైనే బ్యాంక్ గ్యారంటీలను చెల్లిస్తామంటున్నారు. కోటి రూపాయల బ్యాంక్ గ్యారంటీ ఇవ్వడానికి రూ.1.5 లక్షల బ్యాంక్ ప్రాసెస్ ఫీజులు చెల్లించాల్సి ఉంది. మరో 10 లక్షల వరకు మార్జిన్ మనీ కింద చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి మిల్లర్లకు రూ.10 కోట్ల వరకు బకాయిలు చెల్లిస్తామని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఎమ్‌డి చెప్పినా ఇంతవరకు విడుదల కాలేదు. ప్రభుత్వం చెప్పి మూడు నెలలైనా బకాయి డబ్బులు మంజూరు కాకపోవడంతో మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ చెల్లించేందుకు తాత్సారం చేస్తున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే వెంటనే బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలని అధికారులు మిల్లర్లపై ఒత్తిడి చేస్తున్నా వారు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. దీంతో ధాన్యం సేకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

బకాయిల కోసం ఎదురు చూస్తున్నాం

ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నాం. గడచిన ఆగస్టులో పది కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇంతవరకు రాలేదు. ఇప్పటికే మిల్లుల కరెంట్ బిల్లులు, ఇఎంఐల చెల్లింపుల కోసం డబ్బు ఖర్చు చేశాం. మంగళ, బుధవారం నాటికి మరికొంత మంది మిల్లర్లు రూ.5 కోట్ల బ్యాంక్ గ్యారంటీ లను చెల్లిస్తారు.

కొత్తకోట రమేష్, అధ్యక్షులు,
రైస్ మిల్లర్ల సంఘం, మన్యం జిల్లా.

నిరంతర పోరాటమే పిడిఎఫ్ ధ్యేయం

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఎమ్మెల్సీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సీతానగరం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటమే పిడిఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అన్నారు. శనివారం మండలంలోని జోగింపేట కేజిబివి, గురుకుల పాఠశాలలను సందర్శించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేస్తున్న తనకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని విద్యారంగ పరిరక్షణకు నిస్వార్థ పోరాటం చేస్తున్న పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వ విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రస్తుత తరుణంలో దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయ వర్గంపై ఉందన్నారు. మండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపించే పిడిఎఫ్‌కు ఆ అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. ప్రస్తుత విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను వాటి పరిష్కారానికి పిడిఎఫ్ చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కునుకు మురళి, యుటిఎఫ్ నాయకులు పల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ భాషపై శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రాష్ట్ర నైపుణ్యాభివద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికష్ణ చైతన్య శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్యూరా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో పని చేయాలనుకునే నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణలో పాల్గొనే విద్యార్థులు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి, 35 ఏళ్ల లోపు వయసు గలవారై ఉండాలన్నారు. కనీసం రెండేళ్ల బిఎస్సీ అనుభవం లేదా మూడేళ్ల జిఎన్ఎం అనుభవం అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఆరు మాసాల పాటు తిరుపతిలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఇందులో జర్మన్ భాషా కోర్సులు ఎ-1,ఎ-2, బి-1, బి-2 స్థాయిల్లో నేర్పబడతాయని, అభ్యర్థులు జర్మనీలో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రాథమిక అర్హత పరీక్ష ద్వారా జరుగుతుందని, ఈ పరీక్షలో ఇంగ్లీష్, డిజిటల్ స్కిల్స్, జ్ఞాన పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. వీసా పొందిన తర్వాత అభ్యర్థులు రూ. 75 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ఇది తిరిగి చెల్లించబడుతుందని వివరించారు. అభ్యర్థులు రెసిడెన్షియల్ లేదా డే స్కాలర్స్ విధానంలో శిక్షణ పొందవచ్చని, ఈ శిక్షణలో ఆహారం, వసతి ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుందని తెలిపారు. వీసా పొందిన తర్వాత అభ్యర్థులు జర్మనీలో నెలకు రూ. 2,33,000 నుంచి రూ. 3,26,000 వరకు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, అవసరమైన సర్టిఫికెట్లు పంపించాలని, మరిన్ని వివరాలకు 96769 65949 నంబరును సంప్రదించాలని వివరించారు.

27న బాల్య వివాహ ముక్త్ భారత్‌కు శ్రీకారం

ప్రజాశక్తి - పార్వతీపురం

బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఈనెల 27న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రి ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించుటకు అవగాహన కల్పించేందుకు బాల వివాహ ముక్త్ భారత్ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని సంఘాలు, అన్నిశాఖల అధికారులు, అంగన్‌వాడీ, ఆశాలంతా భాగస్వామ్యం కావాలని కోరారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

108 అంబులెన్స్ సర్వీస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయసమ్మతమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమెతో పాటు ఎపి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు జి కిషోర్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ మాట్లాడారు. 2005 నుంచి ప్రజలకు సేవలందిస్తున్న 108 వ్యవస్థ నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల అంబులెన్స్ సేవల్లో నాణ్యత కొరవడిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోందని, అంబులెన్స్‌లు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చేరుకోక అనేకమంది అత్యవసర వైద్య సేవలందక మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించాల్సిన 108 వ్యవస్థలో కార్పొరేట్ శక్తులు ప్రవేశించి తమ లాభాలను పెంచుకునేందుకు ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.. ఈ 108 వ్యవస్థలో పనిచేస్తున్న 3,500 మంది సిబ్బందికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు పరిహారం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 108 వ్యవస్థలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే అనేక దఫాలుగా గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి సమస్యలు విన్నవించుకున్నామని, అయినప్పటికీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం 108 ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో టిడిపి నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, జనసేన నాయకులు జి.శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.సంఘం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు, బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి రమేష్, 104 ఉద్యోగ సంఘం నాయకులు జి దుర్గారావు, చెరువుల పరిరక్షణ సమితి నాయకులు వంగల దాలినాయుడు, తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లి అప్పలనాయుడు అధ్యక్ష వహించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి తెర్లి వెంకటరమణ, తెంటు రాంబాబు, ఆవాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ధాన్యం కొంటుంది : జెసి

జెసికి సమస్యలు విన్నవిస్తున్న రైతులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. మండలంలోని శివరాంపురం పిఎసిఎస్ వద్ద శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు పండించే పంటలను ప్రతి ఒక్క రైతు వద్ద కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దీనికోసం రైతు పంటను వేసినప్పుడే ఇ-క్రాప్ చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వస్తుందని అన్నారు. ఈ ఏడాది తేమ శాతం 17లోపు ఉన్న మొదటి రకం ధాన్యం 100 కిలోల ధర రూ.2320, సామాన్య రకం రూ.2300 వస్తుందని, దీనికి అదనంగా రైతుకు హమాలీలు ఖర్చులు, గోనే సంచులు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. అలా కాకుండా రైతులు వాటిని సమకూర్చుకొంటే వాటి ఖర్చులను కూడా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తారని తెలిపారు. జిల్లా పరిధిలో రెండు ధాన్యం మిల్లులే బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చాయని, మిగతా మిల్లులు కూడా బ్యాంక్ గ్యారంటీలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఆమెతో మాట్లాడుతూ ఈ కొనుగోలు కేంద్రానికి దగ్గరలో వున్న కొట్టక్కి, మిర్తివలస మిల్లులకు ధాన్యం వెళ్లేలా చూడాలని కోరగా, ఆ రెండుమిల్లులు పక్క జిల్లాలో ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలో ఎక్కువ మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు సూచించారు. జెసి వెంట తహశీల్దార్ ఎస్‌వి రమణ, ఎఒ అనురాధ పండా, సర్పంచ్ జరాజాపు మోహన్, బుగత భాస్కరరావు, కృష్ణ, హరి బాలాజీ, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సరుకులన్నీ ఒకేసారి ఎందుకు తరలించరు? : సిఎస్ డిటిపై ఆగ్రహం

సాలూరు: రేషన్ డిపోలకు సంబంధించిన సరుకుల్నీ ఒకేసారి ఎందుకు తరలించడం లేదని జాయింట్ కలెక్టర్ శోభిక సిఎస్ డిటి రంగారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఆమె స్థానిక తహశీల్దార్ కార్యాలయం, జిసిసి గోడౌన్‌లను పరిశీలించారు. రేషన్ డిపోలకు సంబంధించిన సరుకుల్నీ ఒకేసారి తరలించాలని చెపుతున్నా ఎందుకు అమలు చేయడం లేదని రంగారావుపై ఆమె ఆగ్రహించారు. బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారను కూడా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణం, మండలం లో 57 రేషన్ డిపోలకు సరుకులన్నీ ఒకేసారి తరలించాలన్నారు. కొంతమంది రేషన్ డీలర్లు డిడిలు సమర్పించడంలో జాప్యం చేస్తున్నారని డిటి రంగారావు చెప్పగా వారిని ఎందుకు దారిలోకి తేలేకపోతున్నారని ప్రశ్నించారు. గోడౌన్ వర్షాలకు కారుతుందా అని ఆమె ప్రశ్నించగా కారుతుందని గోడౌన్ ఇంఛార్జి రాములు చెప్పారు. కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆమె వెంట తహశీల్దార్ ఎస్ వి రమణ వున్నారు.

రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్



రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- సీతానగరం

మండలం లోని పెదభోగిలి ఆర్‌ఎస్‌కెను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శనివారం సందర్శించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం తయారు చేసుకున్నవారు తీసుకువచ్చిన ధాన్యం నమూనాలను పరిశీలించారు. రైతు సేవాకేంద్రం లో ధాన్యం నాణ్యతా ప్రమాణాలు ఫ్లెక్సీలను ఏర్పాటు పక్కాగా ఉండాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర తెలిసేలా ఏర్పాట్లు చేయాలని, రైతులకు ధాన్యం నూర్పులు జరిగిన వెంటేనే ధాన్యం కలెక్ట్ చేసి తేమశాతం 17శాతం కంటే తక్కువ ఉన్నచో నాణ్యత బాగున్న వెంటేనే వారికి గోనె సంచులు జారీ చేయాలని చెప్పారు. కేంద్రంలో ఎవరైనా బయట మార్కెట్‌లో ధాన్యం అమ్మితే అలాంటి రైతులు కొనుగోలు కేంద్రం ఈ పంట నమోదు నుండి తీసివేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులు సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఉమా, మండల వ్యవసాయ అధికారి, పిపిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవిత భాగస్వామికి పింఛను మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పింఛను పొందే వ్యక్తి మరణించిన సందర్భంలోవారి జీవిత భాగస్వామి (వితంతువు)కి కుటుంబ పోషణ కోసం ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అర్హత మేరకు పింఛను మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పింఛను దారుడు ఈఏడాది నవంబర్ 1న లేదా ఆ తర్వాత మరణిస్తే వారి జీవిత భాగస్వామికి డిసెంబర్ 1 నుంచి పింఛను అందజేస్తామన్నారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీ పూర్తయ్యాక, పింఛను చెల్లించని పింఛనుదారుల రిమార్కు క్యాప్చర్ చేసేందుకు ప్రొవిజన్ మొబైల్ యాప్లో వెల్ఫేర్ అసిస్టెంటు వారికి ఇవ్వబడుతుందని అన్నారు. ఒక వేళ లబ్ధిదారుడు పెన్షన్ పొందిన తర్వాత మరణిస్తే ఎస్ఎస్ పెన్షన్స్ పోర్టల్లో డబ్ల్యుఇఎ/ డబ్ల్యుడబ్ల్యుడిఎస్ లాగిన్ పెన్షనర్ డెత్ సర్టిఫికేట్, జీవిత భాగస్వామి ఆధార్, అవసరమైన పత్రాలతోజీవిత భాగస్వామి పెన్షన్ పొందవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు పెన్షన్ మంజూరు కోసం ఎంపిడిఒ/మున్సిపల్ కమిషనర్లకు పంపబడతాయని, వాటిని పరిశీలించి అర్హత మేరకు పింఛను మంజూరు లేదా తిరస్కరించడం జరుగుతుందని వివరించారు.

అడుగు తీసి అడుగేస్తే టోల్ దరువు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'బాబోయ్... ఇదెక్కడి న్యాయం... అడుగుతీసి అడుగు వేస్తే టోల్ గేట్ రూపంలో దరువు వేస్తారట. ఇలాగైతే... ఇక ఊరు దాటి ఊరు వెళ్లే జేబులు చిల్లే. కూర్చుంటే పన్ను, నిలబడితే పన్ను అన్న చందంగా ఉంది బాబుగారి ప్రభుత్వం తీరు' అంటూ జనం విస్తుపోతున్నారు. 'త్వరలో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారులకు కూడా టోల్‌గేట్ ఛార్జీలు విధిస్తాం. ప్రజల నుంచి వ్యతిరేకత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదే, లేదంటే గతకల రోడ్లే ఉంటాయి' అంటూ సాక్షాత్తు సిఎం చంద్రబాబు నాయుడే శాసన సభలో ఈనెల 19న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మాటలకు జిల్లా వాసుల్లో ఉలికిపాటు మొదలైంది. ఇప్పటికే జిల్లాలోని జాతీయ రహదారులపై నలుదిక్కులా టోల్‌గేట్లు ఉన్నాయి. ముఖ్యంగా జొన్నాడ టోల్‌గేట్‌తో విశాఖ వెళ్లి, వచ్చే ప్రయాణికులపై తీవ్ర భారం పడుతోంది. ఇది చాలదన్నట్టు మానాపురంలో మరొకటి రెడీ చేస్తున్నారు. అటు నాతవలస, ఇటు గంట్యాడ వైపు కూడా టోల్‌గేట్ పెట్టేశారు. ఇప్పటికే ఆర్థిక భారం భరించలేని పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏకంగా రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారులపై కూడా టోల్ ఛార్జీలు విధించేందుకు సిద్ధపడడంతో జనం ఒకింత ఆందోళనతోనూ, ప్రభుత్వంపై ఆగ్రహంతోనూ ఉన్నారు. మన జిల్లాలో 122 కిలోమీటర్ల రాష్ట్ర రహదారి, మరో 292 కిలోమీటర్ల మేర జిల్లా రహదారులు విస్తరించి ఉన్నాయి. వీటిపై టోల్‌గేట్ల ఫీజులు వసూలు చేపట్టడం మొదలెడితే ప్రజలు ప్రయాణం మానుకోవాల్సి తప్ప, తప్పించుకునేందుకు అవకాశం లేదని జనం చర్చించుకుంటున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే, టోల్ గేట్లను అంగీకరించని చోట గతుకుల రోడ్లే ఉంటాయన్న చంద్రబాబు హెచ్చరికలు మరింత ఇబ్బందికరంగా ఉన్నాయన్న చర్చకూడా సాగుతోంది. డబ్బులు ఇచ్చినవారికే రహదారుల సదుపాయం కల్పిస్తామన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ మాత్రం దానికేనా గతుకుల రోడ్ల మరమ్మతు పనుల ప్రారంభానికి మన జిల్లాలో రూ.కోట్ల ఖర్చుచేశారా? అంటూ కొందరు ముక్కున వేళ్లేసుకుంటున్నారు.

అసలే పేదలు, వలసకూలీలు, చిన్న,సన్నకారు రైతులు ఎక్కువ మంది ఉన్న జిల్లా మనది. తలసరి ఆదాయంలో అట్టడుగు స్థానం. అరకొర ఆదాయం స్కూళ్లు, కాలేజీల ఫీజులు, ఆసుపత్రి ఖర్చులకే సరిపోని పరిస్థితి ఎక్కువ కుటుంబాల్లో ఉంది. దీనికితోడు విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్స్ ఇప్పటికీ ఇవ్వలేదు. ఇచ్చినా పెరిగిన పుస్తకాల ధరలు, ఇతర ఫీజులకు ఎటూ సరిపోని పరిస్థితి ఉంది. తల్లికి వందనం సహా సూపర్ -6లో ప్రకటించిన పథకాల అమలుపై శ్రద్ధ చూపలేదు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి రోడ్లపై కూడా మునుపెన్నడూ లేనంతగా టోల్ ఫీజులకు సిద్ధపడడం ఎంత వరకు సమంజసం అంటూ జనం చర్చించుకుంటున్నారు. ఇలా చిన్న రహదారులపై కూడా ఇరకమైన ఛార్జీల మోత మొదలెడితే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకోక తప్పదంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తొలుత విద్యార్థులు స్థానిక కాంప్లెక్స్ రోడ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్ మాటాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లు విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని, డిగ్రీలో మేజర్, మైనర్ ఆనర్స్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలని, ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాపుల పన్నులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పెదమార్కెట్ షాపుల పన్నుల వసూలుపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. బకాయి ఉన్న షాపుల వద్దకు వెళ్లి పన్నులు చెల్లించాలని షాపు యజమానులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం ఒక్క రోజే రూ.లక్షా 88 వేలు వసూలు చేశారు. మార్కెట్‌లో ఉన్న షాపు యజమానులు వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వో ప్రసాదరావు, ఆర్ ఐటిపిఒ పాల్గొన్నారు.

సరైన విద్యతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

సరైన విద్యతోనే భవిష్యత్తు అని జిల్లా మోటర్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం శశికుమార్ అన్నారు. విద్యార్థులు చదువుకొనే సమయంలో సరైన విద్యను నేర్చుకోగలిగితే అప్పుడే వారి భవిష్యత్ బంగారు భవిష్యత్ అవుతుందని తెలిపారు. శుక్రవారం రాత్రి సాలూరు మున్సిపల్ పరిధిలో గల బంగారమ్మ పేట గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలు గురించి స్థానిక వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులను విడిచి ఇక్కడకు వచ్చి పట్టణంలో వివిధ కళాశాలలో చదువుతున్న మీరు నిరంతరం చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకొనే విధంగా కృషి చేయాలన్నారు. మొబైల్ వాడటం వల్ల కలిగే అనర్థాలు చాలా ఎక్కువగా వున్నాయని అటువంటి వాటిని దూరం చేయాలని, ఇక్కడ వుండే పోటీ పరీక్షల కోసం వేటికోసం ఉన్నతమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని రహదారులపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి రాత్రి అక్కడే నిద్రపోయారు. ఈ కార్యక్రమంలో సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవివిఎస్ ప్రసాద్, వార్డెన్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు పరిశీలన

ప్రజాశక్తి కొమరాడ

రోడ్డు మరమ్మత్తు పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బి డిఇ అప్పాజీ అన్నారు. పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే రహదారి మరమ్మతు పనులను శనివారం ఎంపిడిఒ ఎం. మల్లికార్జున రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుంతలు లేని రహదారులను చూడాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా మరమ్మతు పనులను చేయిస్తుందన్నారు. సంక్రాంతి లోపు జిల్లాలో ఎక్కడా రహదారులకు గుంతలు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ ఎఇ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పార్కు తరహాలో ఆశ్రమ పాఠశాల గార్డెన్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల గార్డెన్ పార్కు తరహాలో దర్శనమిస్తుంది. దోనుబాయి పేరుతో గార్డెను పాఠశాలకు వెళ్లిన వెంటనే కనిపించడంతో పార్కు తరహాలో కను విందుగా కనిపిస్తుంది. ఈ గార్డెన్ కు హెచ్ఎం సుకుమార్, పీడీ ఆర్ని రెడ్డి, డిప్యూటీ వార్డెన్ సుబ్బారావు ప్రత్యేక కృషి చేశారు.

సేవా స్ఫూర్తి సత్యసాయి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రేమ మూర్తిగా, సేవా స్ఫూర్తిగా భక్తుల మదిలో సత్యసాయి కొలువై ఉంటారని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల కంచరవీధిలో సత్యసాయి 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయన చూపిన మార్గం, ప్రేమ, సేవా అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ద్వారపు రెడ్డి శ్రీదేవి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సవర భాష పార్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఐటిడిఎ ఎపిఓ కార్యాలయంలో శనివారం సవర భాష పాఠ్యాంశాల పుస్తకాలు ఒకటో తరగతి విద్యార్థులకు ఎపిఓ సురేష్ కుమార్, ఎంఇఓ చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఎంటిటిఐ, ఎంఎల్ఇ సవర భాష పుస్తకాలను పిపి1, పిపి2, పిపి 3 మొత్తం 21 పుస్తకాలను సవర భాష వాలంటీర్లకు అందించారు. ఉత్తమ బోధన అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

స్వర్ణ పంచాయతీ వెబ్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి -సీతానగరం

ఇంటింటి సర్వేను స్వర్ణ పంచాయతీ వెబ్ ఆన్లైన్ చేయాలని డిఎల్‌పిఒ ఎం.నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకొచ్చిన ఇంటి పనుల్లో ఇంటింటా ఆన్లైన్ విధానం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిఆర్ పన్ మ్యాప్‌లోనే ప్రతిరోజు కోఆర్డినేషన్ ఆన్లైన్ చేయాలన్నారు కార్యదర్శులు ఉండాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎ. మన్మథరావు అన్నారు. శనివారం మండలంలోని నీలకంఠాపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందించిన మినుములు, శనగలు, బొబ్బర విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకొని వేసవి పంటలు వేసి అధిక లాభాలు సాధించి, లాభసాటి పంటలు పండించే దిశగా రైతులు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలమైన భవనాన్ని తొలగించాలని మండలంలోని దశుమంతపురం గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే భవనం అక్కడక్కడ స్లాబ్ పెచ్చులు ఊడి దర్శనమిస్తుందని, పిల్లలు ఆట సమయంలో పొరపాటున అటు వెళ్లిన ప్రమాదవశాత్తు ఎటువంటి ప్రమాదం జరిగిన బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. ఈ భవనాన్ని తొలగిస్తే విద్యార్థులు ఆడుకునేందుకు విశాలంగా ఉంటుందని గ్రామ పెద్దలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండానే భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

సీతంపేట : మండలంలోని సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయి సేవాసమితి సత్య సాయి బాబా మందిరం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం సుమారు 2వేల మందికి నిర్వహించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు నగరసంకీర్తన, పతాక ఆవిష్కరణ 15 మందికి వృద్ధులకు అమృత కలశాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అమృత కలశాలు మాజీ ప్రాజెక్టు అధికారి ఎం.సురేంద్ర చీరలు, దుప్పట్లు మాజీ ఎమ్మెల్యే ఎన్.సుగ్రీవులు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కెవి నాయుడు, మేనేజర్ జి.నరసింహులు, శ్రీరాములు, జనార్దనరావు, సుబ్బారావు, వెంకటేష్, త్రినాథ్, భీమారావు, వెంకటరావు, రామకృష్ణ, ఎస్.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యే జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న నాయకులు

జగదీశ్వరికి స్వాగతం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్, గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ విప్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం విచ్చేసిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే జగదీశ్వరికి టిడిపి జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యంపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ పరిధిలో గురుగుబిల్లి మండలం సన్యాసిరాజు పేటలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ సిఐ డి.పద్మావతి ఆధ్వర్యంలో నాటు సారా, అక్రమ మద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నాటు సారా, అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించేందుకు ఎటువంటి అనుమతులను ప్రభుత్వం కల్పించలేదన్నారు.

మినహాయింపు ఇవ్వాలని సిఆర్‌టిల నిరసన

ఐటిడిఎ ముందు రాత్రి బస

ప్రజాశక్తి- పార్వతీపురం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను డిఎస్‌సి నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం ఐటిడిఎ కార్యాలయం వద్ద రాత్రి బసతో నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు, పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి నిరసన శిబిరం వద్దకు వెళ్ళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న సిఆర్‌టిల డిఎస్‌సి నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో 1400 మంది సిఆర్‌టిలు పని చేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్ ఆమోదించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, వి.జ్యోతి, గోవిందమ్మ, సిఆర్‌టిల నాయకులు చంద్రశేఖర్,పెంటయ్య, బాలాజీ, త్రినాథ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిలకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

కనీస వేతనాలిచ్చి ఆదుకోవాలి

ఉపాధ్యాయుల దీక్షలకు పెరుగుతున్న మద్దతు

ఎపి రైతు సంఘం, ఎపిటిఎఫ్ సంఘీభావం

ప్రజాశక్తి- పార్వతీపురం

ఇన్నాళ్ళు వెట్టిచాకిరీ చేయించారని ఇకనైనా కనీస వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన దీక్షలు నాలుగో రోజున శనివారం ఆయన దీక్ష శిబిరం వద్దకు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరశీల పోరాటంతోనే సమస్యలు పరిస్కారమవుతాయని, అటువంటి పోరాటానికి సిద్ధం కావాలని తమ సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు చాలా తెలివైన వారు అని చెబుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వారిని తొలగించకుండా పోస్టులను డిఎస్‌సి నుంచి మినహాయించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణరావు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

మెడకు ఉరి తాడుతో నిరసన

నాలుగో రోజు మెడకు ఉరి తాళ్ళు వేసుకొని నిరసన తెలిపిన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ డిమాండ్లు నెరవేరె వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఆర్‌టిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ టీచర్స్, అధ్యాపకులను సిఆర్‌టిలుగా మార్పు చేయాలని కోరుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వినతిని అందించారు. మరోవైపు పిఇటి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని కూడా వినతిని ఇచ్చారు. సమస్యను విన్న ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఉపాధి హామీతో జీవనోపాధి

ప్రజాశక్తి- సీతంపేట

ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపిడిఒ గీతాంజలి అన్నారు శనివారం మండలంలో ధారపాడు గ్రామపంచాయతీ పరిధిలోని బూర్జ గూడలో నివాసం ఉంటున్న రైతు జీలకర్ర మధుసూదన్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మునగ మొక్కలను పెంచే పనిని ప్రభుత్వ ఆమోదంతో మొదలుపెట్టారన్నారు. ఎంతో శ్రమతో, ఇష్టంతో సుమారు 4వేల మొక్కలు ఆరు నెలల కాలంలో విత్తనం నుంచి మొక్కలుగా మనకి అందించినందుకు గాను రైతుని అభినందించి సన్మానించారు. ఎంతోమంది రైతులు ఇలాంటి పథకాలు ద్వారా మరింత లబ్ధి పొందాలని కోరారు. ఇక్కడ పెంచిన మునగ మొక్కలను సీతంపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీలకు ఉచితంగా ఇస్తామన్నారు. మునగ ఆకును ఆహారంలో ప్రతిరోజు పిల్లలకు అందేటట్టు చేయడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చునని ఆమె చెప్పారు. మునగ మొక్కలను పెంచుకొని ఆరోగ్యంగా ఉండటానికి ఇష్టపడే ప్రతి ఒక్కరూ ఎస్‌హెచ్‌జి సంఘాల ద్వారా మొక్కలను తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఆనంద్ రావు, సూర్యచంద్ర, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ రంగ లక్ష్మి, ఎన్ఆర్ఇజిఎస్ పిఒ సాగర్, దారపాడు సర్పంచ్ సుందరమ్మ, అంగన్వాడి సిబ్బంది, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

అంతర్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వివిఎలదేనని కెవికె ఉద్యాన విభాగ శాస్త్రవేత్త శ్రీనివాసరాజు అన్నారు. శనివారం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో నియోజకవర్గంలో గల ఐదు మండలాల రైతు భరోసా కేంద్ర విఎఎలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి, అరటి, ఆయిల్ పామ్ తదితర అంతర పంటలు సాగులో యాజమాన్య పద్ధతులు సస్యరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడిఎ నిర్మల జ్యోతి, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

కడకెల్లలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెళ్ళ గ్రామంలో శనివారం స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నపిల్లలు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఎమ్ఎల్‌హెచ్‌పి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- కొమరాడ

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ నీలకంఠం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంజాయి మద్యం మత్తు పదార్థాలకు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మంచి చదువు చదువుకోవాలని తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. భావితరాలు యువతదేని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన పత్రాలు వాహనంలో ఉంచుకోవాలని 18 సంవత్సరాల లోపు ఎవరైనా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పు అని ఆయన అన్నారు.

సీతంపేట: మండల కేంద్రంలో సైబర్ నేరాలపై శనివారం ఎస్ఐ వై.అమ్మన్నరావు ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత గురించి రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్, ఖైనా, గుట్కా గంజాయి వంటివి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. మహిళ భద్రత రక్షణ చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు ఉన్నారు.

కొమరాడ: నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరారు.

పార్వతీపురంరూరల్ : చట్టాలపై ప్రతి విద్యార్థికి స్పష్టమైన అవగాహన ఉండాలని, మంచి సమాజాన్ని ఏర్పాటు చేయడంలో విద్యార్థులు కీలకమని రూరల్ ఎస్సై సంతోషి కుమారి అన్నారు. మండలంలోని సురేష్ స్కూల్ విద్యార్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేస్తోందన్నారు. పోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ క్రైం చట్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరగాళ్ల చేసే ఫోన్ కాల్స్, ఓటీపీల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, సిబ్బంది, హోంగార్డు అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు.

వారం రోజులకే ముక్కలు : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న రహదారి పనులు మూణ్ణాళ్ల ముచ్చట కాకుండా వారం రోజులకే ముక్కలైన పరిస్థితి ఏర్పడిందని, పనుల్లో నాణ్యత ఇదేనా అని జెడ్‌పిటిసి సభ్యులు మామిడి శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం పంచాయతీరాజ్ డిఇ చిన్నం నాయుడుతో కలిసి శంబరలో పోలమాంబ అమ్మవారి వనం, చదురు గుడిల వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు. సుమారు రూ.2.40కోట్లు నిధులు వెచ్చించి అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించినప్పటికీ రహదారి పనుల్లో నాణ్యత పాటించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన రహదారి పనులు వారం రోజులకే ముక్కలు కావడమేమిటని, కనీసం రహదారి పనులపై చెంబుడు నీళ్లైన జల్లె పరిస్థితి లేదని డిఇని నిలదీశారు. అధికారుల పర్యవేక్షణ ఉందా లేదా అన్నది మీ దృష్టికి ఈ సందర్భంగా తీసుకురావడం జరిగిందన్నారు. దీనిపై డిఇ మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ రహదారిపై వెళ్లడం వల్ల గోతులు ఏర్పడ్డాయన్నారు. వీటిని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. రహదారి పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు చేపడతామన్నారు. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రోడ్లు నిర్మిస్తారా అని ఆయన ప్రశ్నించారు. దీనివల్ల లక్షలు వెచ్చించి వేసిన రహదారితో ఏమాత్రం ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించారు. కనీసం అధికారులకైనా విద్యుత్ స్తంభాలను పక్కకు ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే విద్యుత్ స్తంభాలను రహదారి పక్కకు మార్చాలని సూచించారు. సదురు గుడి సమీపంలో ఉన్న ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి ఆనుకొని భూమికి నది వైపు మెట్లు మార్గం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. లేకపోతే జాతర సమయంలో భక్తులకు అసౌకర్యం కలిగే ఆస్కారం ఉందన్నారు. వనం గుడి ఎదురుగా నిర్మించిన రోడ్డులో నీరు పోవడానికి మార్గం కూడా లేని పరిస్థితుల్లో ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారని అన్నారు. దీనికి డిఇ స్పందిస్తూ నీరు నిల్వకు ఆస్కారం లేకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ బూరి రజిత్, స్థానిక ఎంపిటిసి పోలినాయుడు, ఉపసర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో భాగంగా పట్టణంలోనిఅభయ క్లినిక్, డయాగ్నోస్టిక్స్, వందన హాస్పిటళ్లను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు వైద్య బృందంతో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు అమలు చేస్తున్నారోనని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, వైద్య పరికరాల పనితీరు, ఆసుపత్రుల ఆవరణ పరిశుభ్రత, రోగుల చికిత్స నిమిత్తం అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన మొదలగు అంశాలన్నింటిపై తనిఖీ చేశారు. రిసెప్షన్ వద్ద రోగుల వివరాలు స్పష్టంగా పూర్తిగా నమో దు చేయాలన్నారు. అగ్నిమాపక రక్షణ పరికరాల నిర్వహణ, వినియో గించే నైపుణ్యంపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ల్యాబ్‌ల్లో పరీక్షల నివేదికలను ఏ విధంగా అందజేస్తున్నారని అడిగి రిపోర్ట్‌లను, అక్కడ పరికరాల పనితీరు, నాణ్యత పరిశీలించారు. నోటిఫైడ్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా,కుక్క కాటు,పాము కాటు వివరాలు నిర్దేశించిన హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు, సలహాలు తెలియజేసే పోస్టర్లను ఆసుపత్రిలో ప్రదర్శించాలాన్నారు. ప్రసవ గదిలో పరికరాలు, స్టెరిలైజేషన్ నిర్వహణ, రేడియంట్ వార్మర్ పనితీరు పరిశీలించారు. శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో అనస్తీషియా వైద్యులు తప్పని సరిగా ఉండాలన్నారు. వివిధ విభాగాల్లో ఉన్న సిబ్బంది నైపుణ్యత ప్రతిభ ను పరీక్షించారు.అనంతరం అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఆరోగ్య శాఖ కార్యాలయం డెమో వై. యోగీశ్వరరెడ్డి, డిఎస్ఓ శంకర్ తదితరులు ఉన్నారు.

తగాదాలకు పాల్పడితే బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - మక్కువ

భూతగాదాలకు పాల్పడితే బైండోవర్ కేసులు పెడతామని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పెదగాసిల గ్రామ రెవెన్యూలో ఇటీవల జరిగిన జిరాయితీ భూతగాదాలో రెండు గ్రూపులకు సంబంధించిన 18 మంది పై బైండోవర్ కేసులు పెట్టినట్లు ఆయన తెలిపారు. జిరాయితీ భూమి గల వ్యక్తులను కొంత మంది భయభ్రాంతులకు గురి చేయటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో నోటీసులు జారీచేసినా అధికారుల వద్దకు వారు రాకపోవడంతో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 107 సెక్షన్ కింద సదర్ వ్యక్తులపై బైండోవర్ చేశామన్నారు. పై నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరు నెలలు జైలు గాని రెండు లక్షల జరిమానా గాని కేసు తీవ్రతను బట్టి రెండు ఏకకాలంలో అనుభవించవలసి వస్తుందని వ్యక్తులకు ఆయన తెలిపారు. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టులో వరుసగా మూడు వారాలు మచి గైర్హాజరైన వ్యక్తులకు నాన్ బెయిల్‌బుల్ వారెంటీ జారీ చేస్తానని వారికి తెలిపారు. కోర్టు నిబంధనల ప్రకారం సదర వ్యక్తులు ఉదయం 10.30 గంటల నుంచి కోర్టు సమయం ముగిసే వరకు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అనుమతులు లేనిదే కోర్టు ఆవరణ దాటకూడదని చెప్పారు.

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఇబ్రహీమ్

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- పాలకొండ

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని, అలాగే ఈనెల 24 స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణ నుండి బైక్ ర్యాలీ ప్రారంభమై సీతానగరం తహశీల్దార్ కార్యాలయం కొనసాగుతుందని అఖిలపక్ష టియు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలు జిల్లా కమిటీ కన్వీనర్ బంటు దాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర మూడోసారి గద్దెనెక్కిన ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాల్లో మార్పులేదని చెప్పారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తోందని దుయ్యబట్టారు. కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వడం లేదని తెలిపారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ట్రెయినీ, గౌరవ వేతనం లాంటి పేర్లతో దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నారని దుయ్యబట్టారు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో 26న చేపట్టే ధర్నాలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 24న అఖిలపక్ష కార్మిక సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యాన పాలకొండలో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, దీన్ని కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రూ.200కే బ్యాంకు అకౌంట్

ప్రజాశక్తి - సీతంపేట

పోస్టర్ శాఖ తరపున బ్యాంక్ ఖాతాలు రూ.200కే తెరవచ్చని, దీన్ని ప్రజలు వినియోగించేలా అవగాహన కల్పించాలని వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి బి.రామ్‌గోపాల్ అన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులందరికీ ఐటిడిఎలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పిసిఎల్ బ్యాంకు ఖాతాలు లేనివారికి ఆధార్ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ అవ్వని వారికి తప్పనిసరిగా ఈనెల 30 నాటికి బ్యాంకు ఖాతాను ఆధార్ నెంబర్‌కు లింక్ చేయాల్సిన ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ సచివాలయ ఉద్యోగులు త్వరితగతిన ఈ పనిని పూర్తి చేయాలని అన్నారు. పోస్టల్ డిపార్ట్మెంట్ నుంచి బ్యాంకు ఖాతాలు రూ.200కే తెరిచే అవకాశం ఉన్నందున ఈ అవకాశాన్ని అందరూ ఉపయో గించుకొని ప్రజలు సచివాలయం సిబ్బంది సహకారంతో ఈ పనిని పూర్తి చేయాలన్నారు. హౌస్ హెూల్డ్ జియో లొకేషన్ సర్వే, స్కూల్ తనిఖీల్లో పురోగతి సాధించాలని సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే సచివాలయ ఉద్యోగుల హాజరు తప్పనిసరిగా ఉండాలని, ఎపి సేవా సర్వీసు డబ్బులు చెల్లింపులు ప్రతిరోజు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.గీతాంజలి, పరిపాలన అధికారి ఎన్.మాస పాల్గొన్నారు.

వీరఘట్టం:ముందుగా సిబ్బంది మైండ్ సెట్ మార్చుకోవాలని లేకపోతే తాము కాపాడ లేమని జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా నోడల్ అధికారి బి రామ్‌గోపాల్ సచివాలయాల సిబ్బందిని హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సచివాలయాల సిబ్బందితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ విధి విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి చేరు వయ్యేలా చూడాలని చెప్పారు. మీ పని మీరే చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్నారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వం మీపై నమ్మకం ఉంచి మిమ్మల్ని సచివాలయల ఉద్యోగులుగా నియమించిందని వాటిని దృష్టిలో పెట్టుకొని విధి నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలన్నారు. ఏ ఒక్క విషయంలో ఎవరితో గొడవ పడవద్దని ముందుగా మీరు అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించాలన్నారు. హౌస్ ఓల్డ్ జియో టాకింగ్, తదితరమైన సర్వే వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. శతశాతం హాజరు ఉంటేనే సిబ్బందికి పుల్లుగా జీతాలు చెల్లించాలని సచివాలయ డిడిఒలను ఆదేశించారు. మీరు చేసిన తప్పులకి మీరే దోషులవుతారు తప్ప మిమ్మల్ని ఎవరు కాపాడరని అది గుర్తుపెట్టుకుని విధులు నిర్వహించాలని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి వెంకటరమణ, సీనియర్ సహాయకులు ఉదయాన శ్రీనివా సరావు, మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి రామ్‌గోపాల్

ఎఎన్ఆర్ ప్లాంటేషన్‌కు సన్నాహాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఎఎన్ఆర్ ప్లాంటేషన్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు మన్యం జిల్లా అటవీ శాఖ అధికారి జి ప్రసూన తెలిపారు. మండలంలోని రెల్ల గ్రామ పరిసర ప్రాంతంలో ఎఎన్ఆర్ ప్లాంటేషన్ కోసం స్థల పరిశీలనకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏటా ప్లాంటేషన్ వేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పది హెక్టార్లలో వివిధ రకాల మొక్కలు వేసేందుకు పలు ప్రాంతాల్లో ప్లాంటేషన్ కోసం స్థల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. ప్లాంటేషన్ ద్వారా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అడవుల్లో కార్చిచ్చు జరిగే ప్రదేశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నావ న్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్స్ గంగరాజు, మణికంఠేశ్వరరావు, ఎస్ఎన్ఒ సూర్య తదితరులు పాల్గొన్నారు.

డిఎఫ్ఒ ప్రసూన

కురుపాం : మన్యంలో అటవీ అభివృద్ధి సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని జిల్లా అటవీశాఖ అధికారిణి జిఎస్ ప్రసూన అన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. వివిధ కార్యక్రమాలు, పథకాల ద్వారా చేపట్టే అటవీ అభివృద్ధి, సంరక్షణ పనులపై అటవీరేంజ్, బీట్ అధికారులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అడవులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అటవీశాఖ పనిచేస్తుందన్నారు. అనంతరం మొండెంఖల్లు పంచాయతీ సంపన్నగూడ, ఇచ్ఛాపురంలో ఉన్న బేస్ క్యాంపు, గుగ్గిలం చెట్లు, టేకు తోటల పెంపకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారులు మణికంఠేష్, డి గంగరాజు, ఎఫ్ఎస్ఎ సూర్యప్రకాష్, బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి మణి కోరారు. శనివారం స్థానిక ఎపి గురుకుల రెసిడెన్షియల్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రిన్సిపల్ సత్యవతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యం వచ్చిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని, అలాగే వైద్య పరీక్షలు చేయించి మలేరియా వచ్చిన విద్యార్థులకు క్రమం తప్పకుండా మాత్రలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.రాధాకృష్ణ, ఎంపిహెచ్ఇఒ కృష్ణ, హెల్త్ అసిస్టెంట్ టి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.